# తల తిరుగుడు తర్కం

కొడుకు భోజనానికి రాకపోవడం రిటైర్డ్ ఎస్పీ రామానుజరావుకి ఆశ్చర్యం కలిగించింది. ఇంట్లో వుంటే వేళకి భోజనం చేసే రకమే అతను. కోడల్ని అడిగితే "ఏమోనండి, ఏదో కేసు విషయంలో చాలా చిరాగ్గా ఉన్నారు. తలాతోకా అంతుపట్టడం లేదట. రెండోసారి పిలిస్తే విసుక్కున్నారు" అంది.

భోజనానికి ఉపక్రమించబోతున్న మనిషి లేచి కొడుకు బెడ్‌రూమ్‌కి వెళ్లారు. "ఏరా చక్రీ, పోలీసు ఉద్యోగం అన్నాక లక్షా తొంభై గొడవలుంటాయి. తిండి మానేసి కూచుంటే పన్లు కావు. రా, అన్నం చల్లారిపోతోంది." అన్నారు చివాట్లు వేస్తున్నట్లు.

ఇన్‌స్పెక్టర్ చక్రధర్ నసిగేడు. "ఏదో, తలకాయ నొప్పిగా ఉంది. ఆ ఏబిడ్స్ కేసు ఎటూ తేలటం లేదు. పట్టపగలు అంత బిజీ రోడ్డులో హత్య. పోలీసులేం చేస్తున్నారని పత్రికలు ఒకటే గోల. ఏం చేయాలో పాలుపోవటం లేదు. మీరు అన్నం తినేయండి"

"నాకు చెప్పు విషయమేమిటో... చిటికలో తేల్చేస్తాను." అన్నాడు తండ్రి నిజంగా చిటిక వేస్తూ. కొడుకు హేళనగా చూడడం ఆయన పోలీసు చూపును దాటిపోలేదు.

"అలా చూడకు. నా తాతలకాలం నాటి పద్ధతులు ఇప్పుడు పనికిరావని తీసిపారేయకు. వివరాలన్నీ చెప్పు. పడక్కుర్చీలో కూర్చునే హంతకుడెవరో చెప్పేస్తాను. నా తడాఖా చూపిస్తాను. నువ్వు సలాం కొట్టకపోతే అరవై యేళ్ల వయసున్న నా మీసానికి సెలవిచ్చేస్తాను. సరేనా? ముందు నడు. వంకాయపప్పు లాగిస్తే తప్ప మన బుర్ర పనిచేయదు." అన్నాడు ముసలాయన.

తండ్రి మాటల మీద గౌరవం లేకపోయినా, ఆయనను చిన్నబుచ్చడం ఎందుకనుకుంటూ భోజనానికి లేచాడు చక్రధర్. అన్నం తిని వక్కపొడి నములుతూ పడక్కుర్చీలో వాల్చేకనే కేసు విషయం ఎత్తాడు రామానుజరావు. అయిష్టంగానే చెప్పనారంభించాడు కొడుకు.

"క్రితం మంగళవారం ఏబిడ్స్ జంక్షన్‌లో టాక్సీలో ఓ శవం కనబడింది. శరత్ అన్నతను చచ్చిపోయాడు. అంత రద్దీ ప్రదేశంలో ఎలా చంపేశారో ఎవరూ ఊహించలేకపోతున్నారు. కేసు నాకప్పగించారు..."

"సరిగ్గా చెప్పు... మొదట్నుంచి చెప్పు. చాదస్తం అనుకోవద్దు. శవం ఎప్పుడు, ఎలా బయటపడింది? ఎవరు ముందు చూశారు? అన్నీ కావాలి. టాక్సీడ్రైవరు స్టేటుమెంటు రికార్డు చేసేవుంటాడుగా. ఆ టేపు వినిపించు అప్పుడే అసలు విషయం బోధపడుతుంది..."

కాస్సేపటిలో టాక్సీ డ్రైవరు రహమాన్ గొంతుక వినిపించసాగింది. "మంగళవారం మధ్యాహ్నం మూడగంటలయిందండి. వర్షం బాగా పడుతోంది. లిబర్టీ దగ్గర ఇద్దరు టాక్సీ ఆపేరు. ఒకాయన కాస్త పొడుగ్గా, ఇంకో ఆయన పొట్టిగా, రెయిన్ కోట్ వేసుకుని ఉన్నాడు. వాళ్లను గుర్తుపెట్టుకోవడం కష్టమండి. వర్షం కదా, పైగా ఎంతమంది పాసింజర్లను గుర్తుపెట్టుకుంటామండి..? ఇలా టాక్సీ ఎక్కినవాళ్లు శవమవుతారని తెలిస్తే బాగా పరికించి చూసేవాళ్లమండి.

ఆ పొడుగాయన "నాంపల్లీ వస్తావా? ఏబిడ్స్ ద్వారా వెళ్లాలి. మా ఫ్రెండు పుల్లారెడ్డి స్వీట్స్ దగ్గర దిగిపోతాడు. నన్ను స్టేషన్ దాకా తీసుకెళ్లాలి" అన్నాడు. సరేనన్నాను. టాక్సీలో వెనక్కాల కూచున్న ఇద్దరూ ఏమైనా మాట్లాడుకున్నారో లేదో నేను గమనించలేదండి. రోడ్డు మీద రష్. వర్షం వల్ల చక్రాలు ఎక్కడ స్కిడ్ అవుతాయోనన్న భయం. దాని మీదే ఉంది నా ధ్యాస. సంతోష్ థియేటర్ దాటాక రైట్

సైడ్‌కి వెళ్లబోతూ ఉంటే ఆ రెయిన్‌కోట్ మనిషి స్ట్రెయిట్‌గా వెళ్లి సాగర్ టాకీస్ దగ్గర దింపమన్నాడు. అక్కణ్నుంచి నాంపల్లీకి రావాలంటే బ్యాంక్ స్ట్రీట్‌కి వెళ్లి హనుమాన్ టేక్‌డీ మీదనుండి బాటా ద్వారా మళ్లీ ఏబిడ్స్‌కి వచ్చి నాంపల్లీ వెళ్లాలి. సరే, మనకేం పోయింది. మీటరు కాస్త ఎక్కువ తిరిగితే...? అనుకుని సాగర్ దగ్గర దింపేను.

దింపేసి, రౌండ్ కొట్టి ఏబిడ్స్‌కి వచ్చి పుల్లారెడ్డి స్వీట్స్ దాకా వచ్చేలోపునే ఒకడొచ్చి నా టాక్సీ గుద్దేశాడండి. నిజానికి నా తప్పేమీ లేదు. రోడ్డు మీద బాగా రష్‌గా ఉంది. వర్షం వల్ల జనాలు అటూ, ఇటూ తెగ పరిగెడుతున్నారు. ఆ మనిషిని నేను చూశాను కూడా. పరాయి వూరివాడులా ఉన్నాడు. మహా కంగారు పడుతున్నాడు. పొట్టిగా, అటుగ్గింజలా ఉన్నాడు. కరక్టుగా చెప్పాలంటే పెనం మీద పేలగింజలా ఆడిపోతున్నాడు. వర్షంలో బాగా తడిసిపోయి కళ్లమీద చినుకులు పడకుండా అరచెయ్యి అడ్డుపెట్టుకున్నాడు. కొంపదీసి వచ్చి పడడు కదా అని నేననుకుంటూండగానే టాక్సీకి అడ్డంగా వచ్చేశాడు. అప్పటికీ సడన్ బ్రేక్ వేశానండి. కానీ బోనెట్ గట్టిగా తగిలింది. ఎగిరిపడ్డాడు. టప్ అని చప్పుడైతే పుచ్చె పగిలిందేమోననుకున్నాను.

నా అదృష్టం, వాడి అదృష్టం బాగుండి అది వాడి తలకాయ కాదు. చేతిలో ఉన్న కొబ్బరికాయ. పుణ్యం పుచ్చి వాడు కింద పడిపోయినప్పుడు ఏ వెహికలూ వాడి మీద నుండి వెళ్లిపోలేదు. పడ్డవాడు చివ్వున లేచి నా మీదకి యుద్ధానికి వచ్చాడు. "కళ్లు కనబడటం లేదా?" అంటూ. నేనూ బండి దిగి "నీకు కనబడుతున్నాయా?" అంటూ అరిచేను. చుట్టూ జనం మూగేరు. పాసింజరు భయపడి టాక్సీ దిగిపోతాడేమోననుకున్నాను. ఇలాటప్పుడు సాధారణంగా అలాగే అవుతుంది. కానీ ఈయన దిగలేదు. ఎందుకా అనుకుంటూండగానే బండి కింద పడిన పెద్దమనిషి "కావాలంటే మీ పాసింజరును అడుగు. ఎవరిది తప్పో.." అంటూ టాక్సీలోకి తొంగిచూసాడు.

చూస్తూనే ఉలిక్కిపడి, "ఏమయింది? అలా ఉన్నాడేమిటి?" అన్నాడు. ఏమయిందా అనుకుంటూ నేను లోపలికి తొంగిచూసాను. సీటులో ఓ మూలకి ఒరిగిపోయి ఉన్నాడు. "ఏమండీ" అంటూ కదిపిచూస్తే ఏముంది? తలకాయ వాల్చేసాడు. ఎవరోగానీ పక్కనుంచి కత్తిపెట్టి పొడిచేసి, శవాన్ని ఓ మూలకి నెట్టేసారు. ఎవరో ఏంటి లెండి? ఆ రెయిన్‌కోటు మనిషే అయి వుంటాడు. వాడే పక్కన కూచుని నోరు నొక్కేసి పక్కనుంచి చాకుతో పొడిచేసాడు. నా డ్రైవింగ్ హడావుడిలో నేనున్నాను.

ఈయన తలవాల్చేయగానే నాకు భయం వేసింది. జనం మూగేరు కదా "మీలో ఎవరైనా డాక్టరున్నారా?" అని అడిగేను. ఒకాయన ముందుకొచ్చి నేను డాక్టర్ని అన్నాడు. నాడి పట్టుకుని చూసి "పోయేడు, పాపం" అన్నాడు. దాంతో మీ పోలీసుల్ని పిలవడం అదీ జరిగింది. తర్వాత మీకంతా తెలుసుకదండీ..."

టేపు ఆఫ్ చేసేశాడు చక్రధర్. "అదీ సంగతి. రెహమాన్ అని ఈ టాక్సీ నడిపే మనిషి ఒక ముఖ్యసాక్షి. టాక్సీ కింద పడబోయిన గణపతి అనే అతను అంతకంటే ముఖ్యసాక్షి... శవాన్ని ముందు అతనే చూశాడు కాబట్టి. చచ్చిపోయాడని నిర్ధారించిన గుంపులో డాక్టర్ గోవింద్ ఇంకో సాక్షి. ఈ సాక్షులందరూ చెప్పగలిగినదేమీ లేదు. పోనీ హత్యాయుధం గురించి చూద్దామా అంటే అది మామూలు రకం చాకు. ఓల్డ్‌సిటీ నిండా అలాటి చాకులే. దాని మీద వేలిముద్రలు లేవు."

రామానుజరావు గారు చిరునవ్వుతో ప్రశ్నించారు. "ఆ రెయిన్‌కోట్ మనిషి గురించి వాకబు చేసివుంటావుగా!"

"చెయ్యక!? అతనేగా అనుమానితుడు! శరత్‌తో బాటు అతను ముందు ఎప్పుడైనా కనబడ్డాడా అని కనుక్కున్నాను. పెద్దగా ఎవరికీ గుర్తులేదు. రెండు గంటల ప్రాంతంలో లిబర్టీలో శరత్‌తో బాటు ఎవరైనా పొట్టి వ్యక్తి, రెయిన్‌కోటు వేసుకుని తిరిగేడా అని అడిగిచూసాను. ఓ ఇరానీ హోటల్లో శరత్ టీ తాగేడట. పక్కసీటులో ఓ పొట్టి వ్యక్తి కూడా టీ తాగాడని ఓనర్ చెప్పాడు. కానీ అతనికి రెయిన్‌కోటు లేదట. శరత్‌తో బాటు అతను కలిసి బయటకు వెళ్లినట్టు చూడలేదంటాడు అతను..."

"...అసలు శరత్ కథేమిటి?"

"పెద్దగా ఏమీ తెలియదు. ముషీరాబాద్‌లో ఒంటరిగా ఉంటాడు. బోధన్‌నుంచి వచ్చాడని, ముందూ వెనకా ఎవరూ లేరని మాత్రం అన్నారు ఇంటిపక్కవాళ్ళు. ఈ హైదరాబాదులో ఒకడి గురించి మరొకడు అంతకన్నా ఏం పట్టించుకుంటారు గనక? వయస్సు ఏభైకి పైనే ఉంటుంది. పెద్దగా ఎవరితోనూ తిరగడు..."

"...అసలు ఏం పని చేస్తాడట? అది తెలిస్తే మోటివ్ బయటపడుతుందిగా..."

"ఇప్పుడేం చేస్తాడో ఎవరూ సరిగ్గా చెప్పలేదు కానీ ఇంతకుముందు మాత్రం మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేసేవాట్ట. మోటివ్ మాట అంటావా, ఒక క్లూ కాస్త దొరికింది. ఈ శరత్‌కి ఆడవాళ్ళ పిచ్చి జాస్తిట. రిప్రజెంటేటివ్‌గా ఊళ్ళు తిరిగినప్పుడు చాలామంది ఇల్లాళ్లతో సంబంధాలు పెట్టుకున్నాట్ట. ప్రతీ ఊళ్లోనూ ఒకరో, ఇద్దరో ఉండేవాళ్లట. అందుకేనేమో పెళ్లీ, పెటాకులూ లేవు..."

"...ఇంకేం? మోటివ్ దొరికిందిగా. ఆ ఆడవాళ్ల భర్తల్లో ఎవడో ఒకడికి కడుపుమండి చంపేసి ఉంటాడు. ఎవరెవరితో సంబంధం ఉందో ఆచూకీ తీయి..." అన్నాడు రామానుజరావు తేలిగ్గా.

"చాల్లే, నీకేం? అతి సులభంగా అనేస్తావ్. చెప్పానుగా, ఊరికి కనీసం ఓ ఇద్దరని. ఎన్ని ఊళ్లని తిరగాలి? కనీసం ఇరవై ఏళ్ల క్రితం వ్యవహారాలివి. అదీ రహస్యంగా జరిగిన విషయాలు. ఎవర్నడిగితే మాత్రం చెప్తారు? నాకు తెలియదంటే నాకు తెలియదంటారు."

"ఆ మాటా నిజమేలే..." అంటూ కాస్సేపు ఊరుకున్నారు రామానుజరావు. కొంతసేపయ్యాక, "ఆ రెయిన్‌కోట్ వ్యక్తిని గుర్తుపట్టే అవకాశం టాక్సీడ్రైవర్ రెహమాన్‌కి మాత్రమే ఉంది. మాటా, తీరూ ఎలా ఉందిట?" అని అడిగేరు.

"మీసం, ఒంటిమీద రెయిన్‌కోట్ ఉన్నాయిట. టాక్సీలోంచి దిగేటప్పుడు మాట్లాడేడట గానీ కంఠస్వరం బొంగురుగా ఉందిట. తిరిగి చూసే అవకాశం రెహమాన్‌కి లేదట."

"...కావాలని అలా మాట్లాడి ఉంటాడులే! పెట్టుడు మీసం కావచ్చు, రెయిన్‌కోట్ క్షణాల్లో తీసిపారేసి గుంపులో కలిసిపోవచ్చు."

చక్రధర్ అడ్డువచ్చాడు, "కృత్రిమంగా మీసం పెట్టుకుంటే శరత్ అడిగివుంటాడుగా!"

"మైడియర్ సన్! శరత్ హత్య చేసిన తర్వాతనే ఆ మీసం తగిలించి ఉంటాడు. టాక్సీ ఎక్కినప్పుడు మీసం ఉందోలేదో రెహమాన్ పట్టించుకోడు, గుర్తుంచుకోడు"

"...పైగా దిగడం కూడా మాంచి రష్‌లో ఉన్నచోట దిగేడు. అతను సరిగ్గా దిగేదాకా కూడా టాక్సీవాడు ఉండలేని పరిస్థితి ఆ జంక్షన్‌లో.."

"...రోడ్డుకి అవతలివైపు ఉన్న పుల్లారెడ్డి దుకాణానికి వెళ్లాలని ముందు చెప్పి ఇలాగ దారి మళ్లించడం ఎందుకు? హత్య చేయడం జరిగిన తర్వాత శవాన్ని పక్కనే పెట్టుకుని కూచోడం కంటే సాధ్యమైనంత త్వరగా దాన్నుండి పారిపోదామని చూడడమే ఏ హంతకుడైనా చేసే పని. ఏబిడ్స్ చేరుతూండగానే వీడు పొడిచేసి ఉండవచ్చు. పొడవగానే ఏదో చెప్పి దిగిపోవచ్చు. కానీ వీడు ఎందుకిలా చేయాలి? ఈ విషయం మీద ఆలోచించావా?"

"ఆలోచించాను. కారణం ఏమీ తట్టలేదు. పుల్లారెడ్డి దగ్గర ఎవరైనా శరత్ మనుషులు ఉన్నారేమోననిపించింది. ఏది ఏమైనా వీడి కారణంగా టాక్సీవాడు పొలోమని ముందు దాకా వెళ్లి వెనక్కి రావలసివచ్చింది. కానీ వీడికేం పోయింది? దర్జాగా దిగేశాడు." ఇక చెప్పడానికి ఏదీ లేదన్నట్టు చక్రధర్ సోఫా లోంచి లేవబోయాడు. "ఎటునుండి నరుక్కురావాలాని ఆలోచించి, ఆలోచించి బుర్ర పాడవుతోంది. కానీ దారి కనబడటం లేదు. అందుకే తలకాయనొప్పి."

రామానుజరావు చిరునవ్వు నవ్వాడు. "అలా లేచి వెళ్లిపోతున్నావేమిటి? చెయ్యాల్సిందంతా చేసేశాను. నువ్వు మాత్రం ఏం చెప్పగలవు? అని భావమా? ఎంత చెడ్డా అనుభవజ్ఞులంరా. కాస్త నన్ను కూడా చెప్పనీ." అన్నాడు.



చక్రధర్ విసుగు దాచుకోలేదు. "నీ పాతకాలం టెక్నిక్‌ల కంటె మా మోడన్ మెథడ్స్ చాలా మెరుగు నాన్నా. హత్య జరిగిన నాలుగురోజుల్లో బోల్డంత సమాచారం సేకరించాను. ఈనాడున్న కమ్యూనికేషన్ సౌకర్యాలు మీకెక్కడున్నాయి? టాక్సీలో శరత్‌తో బాటు ఎక్కిన వ్యక్తి బొమ్మ కంప్యూటర్ గ్రాఫిక్స్‌లో వేయిస్తున్నాను. టాక్సీవాడు సరిగ్గా చూడకపోయినా ఎవడో ఒకడు చూసి ఉంటాడు. దాన్నిబట్టి..."

చక్రధర్ చెప్పేది వినిపించుకోనట్టు రామానుజరావు చెప్పుకుపోసాగేడు. "చూడు చక్రీ! ఎప్పటికైనా సమస్యను ఛేదించడానికి ఉపయోగించాల్సింది తర్కమే. లాజికల్‌గా.."

"నాన్నా, మా ట్రెనింగ్ స్కూలునుండి, నీ దాకా అందరూ చెప్పే పాఠాలే అవి. హత్య చేసే అవసరం, అవకాశం... అంటూ. చూడు, ఇవన్నీ ఎప్పుడో చేసేశాను. సూటి తర్కం ఉపయోగించి సాక్ష్యాలు సేకరించడం జరిగింది. డొంక తిరుగుడు తర్కం ఉపయోగించి శరత్ పాత జీవితం అంత తవ్వడం జరిగింది. కానీ ఏం జరిగింది? అనుమానితులు బోల్డు మంది తేలేరు. ఎవరెవరు ఆడవాళ్లతో పడుకున్నాడో లిస్టు వేసి... అదీ వాళ్లు ఒప్పుకుని చెబితేనే... వాళ్ల భర్తల గురించి కూపీ తీసి, వాళ్లు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో... ఈ రొమాన్సు జరిగి ఇరవైయేళ్లు దాటింది కాబట్టి కొంతమంది చచ్చిపోయి కూడా ఉండవచ్చు. బతికున్నవాళ్లలో హత్యజరిగే సమయానికి వాళ్లకి ఎలిబయ్ ఉందో లేదో చూసుకుని... ఇదంతా అయ్యేపనా?... చెప్పు."

కొడుకు విసిరిన సవాల్‌ని పట్టించుకోకుండా రామానుజరావు ప్రశ్నించాడు, "సూటి తర్కం, డొంకతిరుగుడు తర్కం పనిచేయనప్పుడు తలతిరుగుడు తర్కం అని ఒకటి ఉంది. దాని ప్రకారం ఆలోచించి చూసావా?"

చక్రధర్ తెల్లబోయాడు. "యూ మస్ట్ బీ కిడ్డింగ్. ఆ మాట ఎక్కడా వినలేదు. అయినా అదేం పేరు?"

రామానుజరావు మీసాలు దువ్వుకున్నాడు. "అదే మరి... కుర్రకారుకీ, సీనియర్లకూ తేడా! ఇవి ట్రెయినింగ్ స్కూల్లో చెప్పరు. మాలాటి వాళ్ల దగ్గర నేర్చుకోవాలి. అన్ని విధానాలూ ఫెయిలయిపోయిన తర్వాత ఈ మార్గం పట్టేవాళ్లం మేం. చాలామందికి తెలియదులే. కానీ ఫస్ట్‌క్లాస్‌గా పనిచేస్తుంది.." అంటూ ఇంకా ఏదో చెప్పబోయి కొడుకు మొఖంలో కనబడుతున్న అసహనాన్ని గుర్తించి పాయింటులోకి వచ్చేశాడు తండ్రి.

"తల తిరుగుడు తర్కం పద్ధతిలో విశేషం ఏమిటంటే అసంభవం అని అనుకునేది సంభవమే అని అనుకోవాలన్నమాట. అక్కణ్నుంచి ఆలోచన మొదలుపెట్టాలన్నమాట. ఈ కేసులో మనం అస్సలు ఎవరిని అనుమానించమో వాడే హంతకుడు అనుకోవాలి. వాడికా ఛాన్సు ఉందా, లేదా పరిశీలించాలి. ఈ హత్య కేసులో ముందుగా నువ్వు ఎవరిని అనుమానించవు?"

తండ్రి వాదన మహా తిక్కతిక్కగా ఉన్నట్టనిపించింది చక్రధర్‌కి. ఒళ్లు మండి, "నన్ను" అన్నాడు.

రామానుజరావు నొచ్చుకోలేదు. "కరెక్టు. కానీ నువ్వు అవాళ ఊళ్లో లేవు కాబట్టి నిన్ను అనుమానించడానికి వీలులేదు. నెక్స్ట్..." అన్నాడు.

"...టాక్సీడ్రైవర్" అన్నాడు అదే మూడ్‌లో.

"యస్. అతన్ని అనుమానించి చూద్దాం. అతనే హత్య చేసి పడేసి, కావాలని హంగామా చేసాడనుకుందాం. ఎవరో రెయిన్‌కోట్ వ్యక్తి ఎక్కాడని, ఫలానా చోట దిగాడనీ అతను చెప్పేదానికి సాక్షులు లేరు."

"నువ్వు చెప్పినమాట విని అతన్ని అరెస్టే చేస్తే ముందు నన్ను పిచ్చాసుపత్రిలో పెడతారు. టాక్సీడ్రైవరు హత్య చేయదలచుకుంటే పట్టపగలు, నడిరోడ్డు మీద చేయడు. తీసుకెళ్లి శవాన్ని అర్ధరాత్రి ఏ కొండల్లోనో పడేసి వస్తాడు."

"కరెక్టే. తర్వాత వ్యక్తి ఎవరు?"

"ఇంకెవరు? శవాన్ని మొదటిసారి చూసిన గణపతి, పరీక్ష చేసిన డాక్టరు గోవింద్, కేసు బుక్ చేసిన పోలీసులు..."

"...కంగారు పడకు. వన్ బై వన్ చూద్దాం. గణపతి ఛాన్సులు చూద్దాం. కాస్సేపు అతనే హంతకుడనుకుందాం. అతనికి శరత్‌కు పాతవైరం ఏదో ఉంది, ఈ ఊరు వచ్చాడు. అతన్ని కలిసి మాట్లాడేడు. ఫ్రెండులా కబుర్లు చెప్పాడు. లిబర్టీ దగ్గర ఇరానీ హోటల్లో కలిసి కాఫీ తాగేడు. అతని రెయిన్‌కోటు ఇప్పేసి, పక్కకుర్చీలో పడేసాడు. అందుకనే హోటల్ యజమాని అతని రెయిన్‌కోటుని చూడలేదు. తాగేసిన తర్వాత 'నువ్వు పద' అని శరత్‌ను పంపేసి కాస్సేపు తర్వాత బయటపడ్డాడు. అందువల్ల హోటల్‌వాడు ఇద్దరూ కలిసి వెళ్లడం చూడలేదు. బస్టాపులో శరత్ కలిసేడు. ఏబిడ్స్ పుల్లారెడ్డి దాకా డ్రాప్ చేయమని అడిగేడు. శరత్ ఎక్కించుకున్నాడు. అదను చూసి శరత్‌ను చంపేసాడు..."

"...చంపేసి ఏమయ్యాడట?" అడిగేడు చక్రధర్ వెక్కిరింతగా.

"చెప్తా. అతను దిగినదెక్కడ? సాగర్ టాకీసు దగ్గర. అక్కణ్నుంచి నడుచుకుంటూ పుల్లారెడ్డి దుకాణం దగ్గరికి ఐదు నిమిషాల్లో చేరాడు. దార్లో రెయిన్‌కోటు ఇప్పి పారేశాడు. మీసం లాగిపారేశాడు. కొబ్బరికాయ ఒకటి చేతిలో పెట్టుకున్నాడు. ఫుల్‌రౌండ్ కొట్టిన టాక్సీ అక్కడికి వచ్చేసరికి పన్నెండు నిమిషాలయింది. అది వచ్చేదాకా ఆగి తనంతట తనే వెళ్లి టాక్సీ మీద పడ్డాడు.."

"..టాక్సీ డ్రైవరు స్టేటుమెంటులో కూడా అదే అన్నాడు. ఈ కంగారు గొడ్డు కావాలని వచ్చి నా టాక్సీ మీద పడ్డట్టు అనిపించిందని. కానీ ఎందుకలా చేయడం?"

"ఎందుకంటే కొద్ది నిమిషాల క్రితం టాక్సీ దిగిన వ్యక్తి, టాక్సీ కింద పడబోయిన వ్యక్తి వేరు వేరు అని టాక్సీడ్రైవరు మైండ్‌లో గట్టిగా ఎస్టాబ్లిష్ కావడానికి. హంతకుడిని చూసినది టాక్సీడ్రైవర్ ఒక్కడే. వేర్వేరు వ్యక్తులు అనుకుంటే ఎప్పటికైనా అతనికి గణపతి మీద అనుమానం రావచ్చు. కానీ ఈ పద్ధతి ప్రకారం ఛస్తే అనుమానం రాదు. 'నీ టాక్సీ ప్యాసింజరు ఏమంటున్నాడు?' అంటూ శవంపై అందరి దృష్టి మరల్చినవాడు కూడా అతనే. శవాన్ని మొట్టమొదటిసారిగా చూసిన సాక్షిగానే అతను రిజిస్టర్ అవుతాడు కానీ అనుమానితుడిగా మాత్రం కాదు..."

చక్రధర్ భృకుటి ముడిపడింది కానీ క్రమంగా ముడి విడిపోయింది. నుదురు కొట్టుకున్నాడు, "వాటే బ్రిలియంట్ ఐడియా! ఇప్పుడు గుర్తొస్తోంది. రెయిన్‌కోటు మనిషిది, శవాన్ని మొదటగా చూసిన వ్యక్తిదీ ఒకటే ఎత్తు, ఒకటే లావు. పొట్టివాడు గట్టివాడే! అందుకనే టాక్సీని ఏబిడ్స్ దాటించి సాగర్ దగ్గర ఆపించాడు. టాక్సీవాడు తిరిగి, తిరిగి వచ్చేసరికి పాత ఇమేజ్ చెరిగిపోయింది. కానీ పెద్ద రిస్కే తీసుకున్నట్టు లెక్క! పొరబాటున ఏ బస్సు కిందో పడి చేయి విరిగితే...?"

"ఉరికంబం ఎక్కడం కంటే అదే మేలు కదా! నార్మల్ కోర్సులో నువ్వు కంప్యూటర్లో తయారు చేయించిన బొమ్మ సహాయంతో కొంతమంది అనుమానితులను పట్టుకుని రెహమాన్ ముందు పెరేడ్ చేస్తావ్. అందులో గణపతిని కలపవు, నూటికి నూరుపాళ్లూ శారీరక వర్ణన టాలీ అయినా సరే!

ప్రధాన సాక్షే హంతకుడవుతాడని ఊహించవు కదా!"

"దేవాంతకుడు సుమా! ఉండు గణపతి గతచరిత్ర రేపు కూపీ లాగుతాను." అన్నాడు చక్రధర్ విస్తుపోతూ.

మర్నాడు మధ్యాహ్నానికి రామానుజరావు భోజనం చేసి కునుకు తీస్తూండగా ఫోన్ మోగింది చక్రధర్ లైన్లో ఉన్నాడు. "నాన్నోయ్! నీ తలతిరుగుడు తర్కం అద్భుతంగా పనిచేసింది. నీ గెస్ కరక్టే! గణపతిగాడు దర్జాగా వాడంతట వాడే స్టేషన్‌కి వచ్చేడు. కేసు ఏమయిందండీ అంటూ. పట్టుకుని నాలుగు అడిగి, నాలుగు ఉతికేసరికి అంతా బయటపడింది. ఇతను మిలటరీలో ఉండగా శరత్ ఇతని భార్యతో సంబంధం పెట్టుకున్నాట్ట. పన్నెండేళ్ల క్రితం మాట అది. ఏడాది క్రితం జబ్బు చేసి పోతూ, పోతూ ఆవిడ భర్త దగ్గర పశ్చాత్తాపం వెల్లడించిందట. దాంతో ఇతను పగబట్టాడు.

శరత్‌ను వెతికిపట్టుకుని, ఫ్రెండ్‌షిప్ చేసుకున్నాడు. వారం రోజులు కలిసి తిరిగేక, చనువు సంపాదించి, నువ్వు చెప్పినట్టుగానే కలిసి టీ తాగి, టాక్సీలో పక్కనే ఎక్కి నోరు మూసేసి పొడిచేశాడు. థాంక్స్ నాన్నా... గొప్ప తర్కం నేర్పించినందుకు!"

"ఒరేయ్, వాణ్ని అక్కడే ఉంచు. వచ్చి వాడి బ్రిలియెంట్ బ్రెయిన్‌కి కంగ్రాట్స్ చెప్తాను..." అరిచాదు రామానుజరావు.